సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 12 । జూన్ । 2024



బడికి రెడీ

వేసవి సెలవుల్లో ఆటపాటలతో సరదాగా గడిపిన విద్యార్థులు ఇక బడిబాట పట్టనున్నారు. బుధవారం నుంచి బడిగంట మోగనుంది. పాఠశాల తలుపులు తిరిగి తెరుచుకోనున్నాయి. ఈ మేరకు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పలు స్కూళ్లలో మరమ్మతులు పూర్తి చేయగా మంగళవారం తరగతి గదులను శుభ్రం చేశారు. ఆయా పాఠశాలల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించడం, టాయిలెట్లను శుభ్ర పర్చడం, రంగులు వేయించడం చేశారు. విద్యార్థులకు అందించే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు సిద్ధంగా ఉన్నాయి.


షాబాద్: పోతుగల్ ప్రాథమిక పాఠశాలను శుభ్రం చేస్తున్న కూలీలు


మొయినాబాద్‌రూరల్: అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన నూతన బెంచీలు


నందిగామ: చంద్రాయన్‌గూడ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులు, టాయిలెట్స్‌కు రంగులు


మొయినాబాద్: మండల వనరుల కేంద్రంలో సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు

న్యూస్‌రీల్

మైసిగండి హుండీ ఆదాయం రూ.15.17 లక్షలు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కడ్తాల్: మైసిగండి మైసమ్మ దేవత, శివాలయ, రామాలయ దేవస్థానం హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శేఖర్ సమక్షంలో అధికారులు మంగళవారం లెక్కించారు. మొత్తం 75 రోజులకు గాను భక్తులు కానుకల రూపేణ వివిధ హుండీల్లో వేసిన మొత్తం లెక్కించగా రూ.15,17,494 ఆదాయం సమకూరింది. ఈ మొత్తాన్ని కడ్తాల్ కెనరా బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ స్నేహలత, ట్రస్టీ శిరోలీ, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ వికారాబాద్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, కామర్స్, జువాలజీ బోధించేందుకు పార్ట్ టైమ్ ప్రాతిపదికన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌శర్మ తెలిపారు. అభ్యర్థులు సంబంధిత పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు పొంది ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులకు జిరాక్స్ కాపీలను జతచేసి ఈ నెల 14వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు మొయినాబాద్ మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలో గల ఎస్వీ విద్యా సంస్థల క్యాంపస్‌లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ వికారాబాద్ గురుకులు మహిళా డిగ్రీ కళాశాలలో సమర్పించాలని సూచించారు. స్క్రీనింగ్ టెస్ట్, డెమో ద్వారా ఉద్యోగ నియామకం ఉంటుందని వెల్లడించారు. మిగతా వివరాల కోసం 83749 15652 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మదర్ డెయిరీలో కార్మికుల ఉద్యోగాలు క్రమబద్ధీకరణ


కార్మికులకు పత్రాలు అందజేస్తున్న చైర్మన్ శ్రీకర్‌రెడ్డి

హయత్‌నగర్: నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సమాఖ్య(నార్మల్ మదర్ డెయిరీ)లో తాత్కాలిక పద్ధతిలో పని చేస్తున్న కార్మికుల ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తున్నామని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పిస్తున్నామని పాలక మండలి చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం కార్మికులకు సంబంధిత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు శీతల కేంద్రాల్లో ఎంతోకాలంగా పని చేస్తున్న కార్మికులు తమ ఉద్యోగాలను క్ర మబద్ధీకరించాలని కోరుతున్నారని చెప్పారు. ఈ మేరకు ఇటీవల జరిగిన పాలక మండలి స మావేశంలో ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించినట్టు తెలిపారు.సంస్థ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్న ట్లు ఆయన వివరించారు.కార్యక్రమంలో పలువురు బోర్డు సభ్యులు,అధికారులు పాల్గొన్నారు.

సోయగాల నయా‘ఘర్’

కృత్రిమ జలపాతాలు, కుంటలతో ప్రకృతి సౌందర్యం

- గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, ఫాంహౌస్‌ల్లో ఏర్పాటు
- విదేశీ చేపలు, పూలు, మొక్కలతో అలంకరణ
- ఆవిష్కృతమవుతున్న నయా ట్రెండ్



సాక్షి, సిటీబ్యూరో: నగరవాసులు సరికొత్త ఆహ్లాదానికి ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నారు. ఇన్నాళ్లూ స్విమ్మింగ్ పూల్స్, జిమ్, ఇన్‌డోర్ స్టేడియాలకు అలవాటు పడిన సిటీజనులు ఇప్పుడు ప్రకృతి వైపు చూస్తున్నారు. చెరువులు, పక్షులవైపు కాస్త ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా తమ జీవన విధానంలో జీవ వైవిధ్యంపై ప్రాముఖ్యమిస్తున్నారు. ఈ క్రమంలో ఇల్లు ఎంత చిన్నదైనా తమకున్న విస్తీర్ణంలో ప్రకృతికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. వీలైనంత వరకు కుంటలు, జలపాతాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

ధర ఎంతంటే..

పాండ్స్ తయారు చేసుకునేందుకు కనీసం 130 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండాలి. ఇందుకు కనిష్ఠంగా రూ. 3 లక్షలు ఖర్చవుతుంది. తాటిచెట్లు, అలోఖియా, రంగురంగుల పూల మొక్కలు వంటి ట్రోపికల్ ప్లాంట్స్ పెంచుతారు. ఒక కుంట తయారీకి 1 నుంచి 3 అడుగుల లోతు తవ్వాల్సి ఉంటుంది. ఇందుకు 10 నుంచి 12 మంది స్ట్రక్చరల్ ఇంజినీర్లు, ల్యాండ్ స్కేపర్లు, డిజైనర్లు, కూలీలు అవసరం ఉంటుంది. ముఖ్యంగా ఈ ఏర్పాటుకు 1 నుంచి 2 నెలల సమయం పడుతుంది. కనిష్ఠంగా 130 చదరపు అడుగులు ల్యాండ్ స్కేపింగ్, ప్లాంటేషన్ కోసం 90 శాతం స్థలం అవసరం పడుతుంది. వీటి ఏర్పాటుకు భూమి లోపల 1 నుంచి 3 అడుగుల లోతు తవ్వాలి.

లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాల్లో..

ఈ తరహా సౌకర్యాలను వినియోగించుకునేందుకు ముఖ్యంగా వీకెండ్ హోమ్స్ లగ్జరీ అపార్ట్‌మెంట్స్, విల్లాల నివాసితులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. జపాన్ కోయీ ఫిష్, ఆఫ్రికన్ సిచిలిడ్, పామ్ ట్రీస్, బర్డ్ ఆఫ్ ప్యారడైజ్ వంటి ట్రోపికల్ మొక్కలను పెంచుతారు. వీటి జీవిత కాలం 20 నుంచి 30 ఏళ్లు ఉంటుంది. ఈ చేపలు 1.5 చ. అడుగుల నుంచి 3 అడుగుల వరకు పెరుగుతాయి. ముఖ్యంగా ఇవి ఇక్కడి వాతావరణానికి పెరిగే, తట్టుకునే చేపలు, మొక్కలను మాత్రమే వీటిలో ఉపయోగిస్తారు. ఇవి పసుపుపచ్చ, నీలం రంగులో ఉంటాయి. ఇదిలా ఉండగా ఈ చేపలు నీటి అడుగు భాగంలో ఉంటూ అక్కడి వ్యర్థాలను శుభ్రం చేస్తాయి.

నగరం నలువైపులా..

- కాంక్రీట్ జంగిల్ జీవనంలో అలవాటు పడ్డ నగరవాసి ముఖ్యంగా కరోనా తర్వాత ప్రకృతికి దగ్గర కావాలని అనుకుంటున్నాడు. అందులో భాగంగా పక్షులు, పెట్స్‌తో పాటు జలచరాల వైపు ఆసక్తిగా చూస్తున్నాడు. జలచరాలను పెంచాలనే ఆసక్తి ఇటీవల బాగా పెరిగింది. అందుకే తమకున్న విస్తీర్ణంలో చిన్న చిన్న కొలనులు ఏర్పాటు చేసి అందులో చేపలను పెంచాలని అనుకుంటున్నాడు.
- చేవెళ్ల, నార్సింగి, కోకాపేట్, తెల్లాపూర్, బోడుప్పల్, అత్తాపూర్, ఘట్కేసర్, వనస్థలిపురం, ఎల్బీనగర్ ఇలా నగరం నలువైపులా ఈ తరహా కృత్రిమ జలపాతాలు, కుంటలు ఏర్పాటు చేసుకునేందుకు నివాసితులు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా విదేశాల్లో ఉండే పిల్లలు తల్లిదండ్రులకు ఇలాంటి ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

కరోనా తర్వాత ఆదరణ

ఇటువంటి జీవన విధానానికి, ప్రకృతికి దగ్గరగా ఉన్న పద్ధతికి నగర వాసులు అలవాటుపడుతున్నారు. ముఖ్యంగా కరోనా తర్వాత మారిన జీవన పరిస్థితులు ఈ పద్ధతి వైపు ఆసక్తి చూపాయి. ప్రశాంత వాతావరణం, అందమైన పరిసరాలను నగర వాసి కోరుకుంటున్నాడు. రాబోయే రోజుల్లో వీటికి ఆదరణ పెరుగుతుంది.

– సయ్యద్ ఫహద్, అక్వా స్టూడియో ఎక్స్, యజమాని

ప్రశాంతత కోసం..

ఈ పద్ధతిలో నిర్వహించే కుంటల నిర్వహణకు పెద్దగా ఖర్చు కాదని నిపుణులు చెబుతున్నారు. వీటిని నెలకోసారి శుభ్రం చేస్తే సరిపోతుంది. వీటిని ఎక్కువగా కంపెనీ సీఈఓలు, డైరెక్టర్లు, బడా వ్యాపారులు, ఉన్నత ఉద్యోగులు వినియోగిస్తున్నారు. ప్రశాంత వాతావరణం కోసం వీటిని ఏర్పాటు చేస్తారని నిపుణులు చెబుతున్నారు.

ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలి


మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీనివాస్

టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్

షాద్‌నగర్‌రూరల్: ప్రతిఒక్కరూ ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ప్రతం ఎడ్యుకేషనల్ కళాశాలలో మంగళవారం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో సమూల మార్పులు తీసుకువచ్చే శక్తి విద్యార్థుల్లో ఉంటుందని అన్నారు. యువతీ యువకులు సామాజిక స్పృహను అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. విద్యార్థులు మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. చెట్లు లేకుంటే వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని, జీవకోటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. కాలుష్యాన్ని తరిమికొట్టాలంటే ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా తమ ఇంటి ఆవరణతో పాటు వ్యవసాయ పొలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ నాయకులు సుదర్శన్, రాహుల్, శ్రీనివాస్, అఖిలేష్, వినయ్, వంశీ, విజయ్, రమేష్, సతీష్, నితీష్, సుజిత్, హర్షవర్దన్, రిషికేష్, సాయి, నరేష్, అజయ్‌కుమార్, నాగరాజ్, రవితేజ, నర్సింహ, మహేందర్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి

కడ్తాల్: మండల కేంద్రం సమీపంలో ఇటీవల దారుణ హత్యకు గురైన గోవిందాయిపల్లి గ్రామానికి చెందిన శేషుగారి శివగౌడ్, గుండెమోని శివ గౌడ్ కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, న్యాయం జరిగేలా చూస్తా మని నాగర్ కర్నూల్ లోక్‌సభ సభ్యుడు డాక్టర్ మల్లురవి అన్నారు. మంగళవారం సాయంత్రం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి గోవిందాయిపల్లి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మల్లు రవి మాట్లాడుతూ.. యువకుల జంట హత్య కేసులో పోలీస్ యంత్రాంగం పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి, చట్టపరంగా నిందితులకు కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి బాధిత కు టుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామ న్నారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత ఇరువురి కుటుంబాలకు రూ.10 వేల చొప్పున రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీని వాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ పాల్గొ న్నారు.

పారదర్శకంగా ఆర్టీఏ పౌరసేవలు

సాక్షి, సిటీబ్యూరో: రవాణా శాఖ అందజేస్తున్న వివిధ రకాల పౌరసేవలను వాహనదారులకు మరింత చేరువ చేసేందుకు హైదరాబాద్ ఆర్టీఏ వినూత్నమైన అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీలు, వాహనాల బదిలీలు తదితర సేవల కోసం ఏజెంట్‌లను, దళారులను ఆశ్రయించాల్సిన అవరం లేకుండా అవగాహన కల్పించేందుకు ఖైరతాబాద్‌లో ఎల్‌ఈడీ బోర్డులను ఏర్పాటు చేశారు. లెర్నింగ్ లైసెన్సులు, డ్రైవింగ్ లైసెన్సులు, ఎన్‌ఓసీ వంటి సుమారు 56 రకాల సేవల కోసం ఆన్‌లైన్‌లో ఎలా స్లాట్ నమోదు చేసుకోవాలి? ఫీజులు ఎలా చెల్లించాలి? సంబంధిత టెస్టులకు ఏ విధంగా హాజరు కావాలి? వంటి వివరాలను ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ద్వారా ప్రదర్శిస్తున్నారు. కొన్ని రకాల పౌరసేవల కోసం వాహనదారులు ఆర్టీఏ అధికారులను సంప్రదించాల్సిన అవసరం లేదు. టీ–యాప్ ఫోలియో ద్వారా నేరుగా పొందవచ్చు. అలాంటి సేవల వివరాలను సైతం ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేసుకోవాలి? సంబంధిత డాక్యుమెంట్‌లను ఏ విధంగా అప్‌లోడ్ చేయాలి? అధికారుల నుంచి లభించే ధ్రువీకరణ పత్రాలను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి? అనే అంశాలపైనా వాహన వినియోగదారులకు విస్తృతమైన అవగాహన కల్పించేలా వివరాలను ప్రదర్శనకు ఉంచినట్లు హైదరాబాద్ జేటీసీ రమేష్ తెలిపారు. ‘రవాణాశాఖ అందజేసే సర్వీసుల కోసం మధ్యవర్తులను, ఏజెంట్‌లను ఆశ్రయించవలసిన అవసరం లేదు. అన్ని సేవలు వినియోగదారులకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి’ అని ఆయన చెప్పారు. వివిధ రకాల సర్వీసుల కోసం ఆర్టీఏకు చెల్లించాల్సిన ఫీజుల వివరాలను సైతం త్వరలో భారీ డిస్‌ప్లేల ద్వారా ప్రదర్శించనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి

ఐదేళ్లు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు

- జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి

తుర్కయంజాల్: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు, సంబంధిత సిబ్బంది లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. ప్రతి ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటంతో పాటు, మౌలిక వసతుల కల్పనకు వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ తీగల అనితా రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆమె అధ్యక్షతన మంగళవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో పాలక వర్గం చివరి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్ల కాలంలో ప్రజలకు ఉపయోగపడే ఎన్నో తీర్మానాలు చేశామని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాలన సాగేందుకు సహకరించిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్య, విద్యుత్, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డిప్యూటేషన్‌లను రద్దు చేయాలని పలువురు సభ్యులు కోరగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ అది శాఖాపరమైన నిర్ణయమని తెలిపారు. ప్రతి ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నిర్వహణ సరిగ్గా లేదని, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించి గ్రామాల్లో వాల్స్, కంట్రోల్ వాల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జెడ్పీ సీఈఓ కృష్ణా రెడ్డి, డిప్యూటి సీఈఓ రంగా రావు, పలువురు జెడ్పీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్లాన్ వేశారు.. ప్రాణం తీశారు

- వీడిన హత్య కేసు మిస్టరీ
- ఐదుగురు నిందితులకు రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జి ఏసీపీ కృష్ణయ్య


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి ఏసీపీ కృష్ణయ్య, చిత్రంలో నిందితులు

మీర్‌పేట: పాత నేరస్తుడి హత్యకు సంబంధించి పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌చార్జి ఏసీపీ కృష్ణయ్య వివరాలు వెల్లడించారు. నందనవనానికి చెందిన ప్రధాన నిందితుడు దాసరి సురేందర్ అలియాస్ సూరి (29) వృత్తిరీత్యా కారు డ్రైవర్. మృతుడు సల్మాన్‌తో కొంత కాలంగా పరిచయం ఉండడంతో పాటు ఇద్దరూ కలిసి గతంలో పలు నేరాలకు పాల్పడడంతో పీడీయాక్ట్ నమోదై జైలుకు సైతం వెళ్లి వచ్చారు. సురేందర్ 2021లో సల్మాన్ సోదరి సభా ఫాతిమాను కిడ్నాప్ చేసి బలవంతంగా వివాహం చేసుకోవడంతో పోలీసులు అతనిపై పోక్సో, రేప్ కేసు నమోదు చేసి 80 రోజుల రిమాండ్ విధించారు. జైలు నుంచి బయటకు వచ్చిన సురేందర్ మతం మార్చుకుని మొయిన్ మునీర్‌గా పేరు మార్చుకుని సల్మాన్ సోదరిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమార్తె జన్మించింది. 2022లో సురేందర్ భార్య ఫాతిమాను హత్య చేయడంతో ఎల్బీనగర్ పోలీసులు అతనిపై పీడీయాక్ట్ నమోదు చేసి జైలుకు పంపించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత సల్మాన్ సోదరి (కజిన్) మంచాల స్వర్ణలతతో చనువుగా ఉంటున్నాడు. తన సోదరిని వివాహం చేసుకుని హత్య చేయడంతో పాటు మరో సోదరితో చనువుగా ఉండడాన్ని గమనించిన సల్మాన్ సురేందర్‌పై కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా హతమారుస్తానని స్నేహితులతో చెప్పగా విషయం సురేందర్‌కు తెలియడంతో అతనే ముందుగా సల్మాన్‌ను హత్య చేసేందుకు పథకం వేశాడు. దీనికి స్వర్ణలత, పాత నేరస్తులైన స్నేహితులు బొర్రా అరుణ్‌కుమార్, దుగాని లక్ష్మణ్, కేతావత్ అరుణ్ సహకరిస్తామని చెప్పారు. ఈ నెల 8న నందిహిల్స్‌లోని స్నేహితుడి ఇంట్లో ప్లాన్ వేశారు. పథకం ప్రకారం ఆర్థిక లావాదేవీల సమస్యను పరిష్కరించుకుందామని స్వర్ణలతను ఎరగా వేసి రాత్రి 11.30 గంటలకు సల్మాన్‌కు ఫోన్ చేసి టీకేఆర్ కమాన్ సమీపంలోని అయ్యప్ప దేవాలయం వద్ద నిర్జన ప్రదేశంలోకి పిలిపించారు. సల్మాన్ రాగానే సురేందర్‌తో పాటు మరో ముగ్గురు కత్తులతో పొడిచి హత్య చేశారు. ప్రధాన నిందితుడు సురేందర్‌తో పాటు స్వర్ణలత, మరో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సురేందర్‌పై పలు పోలీస్‌స్టేషన్లలో 39 కేసులు నమోదయ్యాయి. నిందితుల నుంచి రెండు కత్తులు, మూడు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్, డీఐ గౌరీనాయుడు, ఎస్‌ఐలు గోవిందస్వామి, సుధాకర్, సిబ్బంది ఎల్లయ్య, నగేష్, శివరాజు, అనిల్‌రాజు పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌కు తిరుగులేదు



తాపీమేస్త్రీకి బహుమతి అందజేస్తున్న మహ్మద్ సాహెర్

సంస్థ టెక్నికల్ ఇంజనీర్ మహ్మద్ సాహెర్

మీర్‌పేట: నిర్మాణరంగంలో భారతి సిమెంట్ తిరుగులేని సంస్థగా ఎదుగుతోందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ మహ్మద్ సాహెర్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి మీర్‌పేట ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌లోని లక్ష్మి స్టీల్ ట్రేడర్స్, డీలర్‌షాపులో తాపీమేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహెర్ మాట్లాడుతూ.. భారతి సిమెంట్ అల్ట్రా ఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందన్నారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని అన్నారు. అల్ట్రాఫాస్ట్ స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపికన్నారు. అదే విధంగా అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేయడంతో పాటు స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని వివరించారు. అనంతరం తాపీమేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. సమావేశంలో డీలర్ చంద్రశేఖర్, టెక్నికల్ ఆఫీసర్ బద్రి పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు

ఏడుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

మొయినాబాద్: ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొనడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన మంగళి శ్రీకాంత్‌తో పాటు శ్రీనివాస్, అతని ముగ్గురు కూతుళ్లు ఉదయం కారులో మొయినాబాద్‌కు వచ్చారు. మధ్యాహ్నం తిరిగి అప్పారెడ్డిగూడ బయలుదేరారు. మొయినాబాద్ సమీపంలోని కిరన్ వేబ్రిడ్జ్ వద్దకు వెళ్లగానే డ్రైవర్ శ్రీకాంత్ కారును అతివేగంగా నడిపి ఎదురుగా వస్తున్న చేవెళ్ల మండలం కందవాడకు చెందిన శ్రావణ్ కారును కుడివైపున ఢీకొట్టాడు. దీంతో కారులో ఉన్న శ్రీకాంత్, శ్రీనివాస్‌తోపాటు ముగ్గురు పిల్లలకు గాయాలయ్యాయి. శ్రావణ్ కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో అతనికి ఎలాంటి గాయాలు కాలేదు. శ్రీనివాస్‌కు, అతని కూతుళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స కోసం స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బంధువు అంత్యక్రియలకు వెళ్తుండగా ఘటన

ద్విచక్రవాహనాన్ని ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో దంపతులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ సమీపంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన మేకల కొమురయ్య, జంగమ్మ దంపతులు ఉదయం జనవాడలో మృతి చెందిన తమ బంధువు అంత్యక్రియలకు వెళ్లేందుకు ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలో మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ సమీపంలోకి వెళ్లగానే వెనకనుంచి అతివేగంతో వచ్చిన గుర్తుతెలియని వాహనం వీరిని ఢీకొట్టింది. దంపతులిద్దరూ రోడ్డుపై పడటంతో గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని చికిత్సకోసం స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

సినీ రచయిత ఆత్మహత్య

రహమత్‌నగర్ : కుటుంబ కలహాల కారణంగా ఓ సినీ రచయిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డీఐ భూపాల్ గౌడ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బోరబండ డివిజన్ రాజ్‌నగర్‌లో నివాసం ఉంటున్న శివ(60) సినిమాలకు స్క్రిప్ట్ రైటర్‌గా పని చేస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా భార్య పిల్లలతో కలిసి వేరుగా ఉంటోంది. మంగళవారం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తలుపులు తెరిచి చూడగా శివ ఉరివేసుకుని కనిపించాడు. మృతదేహం కుళ్లిపోయే స్థితిలో ఉంది.




తాళ్లపల్లిలో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల భవనం

సర్కారు బడి.. సమస్యల ఒడి

సరిపడా లేని ఉపాధ్యాయులు, శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు, అపరిశుభ్ర వాతావరణంతో మండలంలోని పలు సర్కారు బడుల విద్యార్థులు సావాసం చేస్తున్నారు. ప్రభుత్వం విద్యా ప్రోత్సాహానికి కట్టుబడి ఉన్నామనే హామీ నేతి బీరకాయ చందంగా మారింది. వర్షాకాలంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలతో చిన్నారులకు ముప్పు పొంచి ఉంది. ఈ దశలో బుధవారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇప్పటికైనా సర్కారు బడుల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండలవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మల్లారెడ్డిగూడలో పాఠశాల భవనం దుస్థితి

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

- శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు
- బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు

షాబాద్: ప్రభుత్వం విద్యావ్యాప్తికి కోట్లాది రూపాయలు వెచ్చించిన్నప్పటికీ కనీస సౌకర్యాలు లేక కొన్ని సర్కారు పాఠశాలలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. షాబాద్ మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 8, ప్రాథమికోన్నత పాఠశాలలు 9, ప్రాథమిక పాఠశాలలు 40 ఉన్నాయి. మొత్తం 260 ఉపాధ్యాయుల పోస్టులకు గాను, 205 మంది ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నారు. 55 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. మనఊరు మనబడి పథకం కింద మండలంలో 21 పాఠశాలలకు ఎంపిక చేశారు. ఇందులో సర్దార్‌నగర్, అంతారం, కక్కులూర్ గ్రామాల పాఠశాలల్లో పూర్తి చేశారు. మిగతా 18 గ్రామాలల్లో పనులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పనులు చేసిన వారికి బిల్లులు రాకపోవడంతో వాటిని నిలిపివేశారు. మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ, చర్లగూడ, ఊబ్బగుంట, దైవాలగూడ, తాళ్లపల్లి తదితర గ్రామాల్లో పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. పాఠశాలల్లోనే విద్యార్థులు బిక్కుబిక్కు మంటున్నారు. ఎలా చదవాలని వారు ప్రశ్నిస్తున్నారు. అక్షరాస్యతను పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టామని పేర్కొంటున్నా ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. ఇలా అయితే ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఎలా ఫలితాలు సాధిస్తారంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. విశాలమైన ప్రాంగణాలు ఉన్నా ప్రహరీ లేక పశువులు సంచరిస్తున్నాయి. పాఠశాల చుట్టూ పిచ్చి మొక్కలు ఉండడంతో పాములు, పురుగులు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తిచేయాలి



మా గ్రామంలోని పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షం కురిస్తే గోడలు నాని కూలిపోతుందని విద్యార్థులు భయపడుతున్నారు. ఈ పాఠశాలలో చదువులు ఎలా కొనసాగించాలి. మన ఊరు మనబడి పథకం కింద రూ.13 లక్షలు మంజూరు అయ్యాయి. పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో వాటిని నిలిపివేశారు. వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలి.

– బాస నర్సింహులు, తాళ్లపల్లి, షాబాద్

వైద్య వాహనాల తనిఖీ



సంచార పశువైద్యశాల వాహనంలో రికార్డు పరిశీలిస్తున్న అధికారులు

కందుకూరు: మండల కేంద్రంలో మంగళవారం సంచార పశువైద్యశాల, 102 అమ్మ ఒడి వాహనాలను జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా కోఆర్డీనేటర్ రాజాబాబు తనిఖీ చేశారు. పశువైద్య వాహనంలో సిబ్బంది పశువుల వద్దకు వెళ్లి చికిత్స చేసే విధానాన్ని పరిశీలించారు. మందులు సరిగ్గా ఉన్నాయా లేదా అని వాకబు చేశారు. సరైన సేవలతో రైతుల ప్రశంసలు పొందాలని సూచించారు. అనంతరం 102 వాహనాన్ని తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్సకు వచ్చే గర్భిణులకు 102 వాహనం అందుబాటులో ఉండి సేవలందించాలని సూచనలు చేశారు.

మాజీ ఎంపీపీ, సర్పంచ్‌లకు సేవారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న మాజీ ఎంపీపీ విశ్వనాథం

కేశంపేట: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ సేవారత్న అవార్డుకు మండల మాజీ ఎంపీపీ సజ్జల విశ్వనాథం, కేశంపేట గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం శ్రీధర్‌రెడ్డి ఎంపికయ్యారు. వీరికి మహారాష్ట్రలోని పూణేలో సోమవారం నిర్వహించిన 4వ వెస్టర్న్ ఇండియా సమావేశంలో అవార్డులను బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అందజేశారు. గ్రామీణస్థాయిలో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న పలువురిని గుర్తించి, వారు మరిన్ని సేవా కార్యక్రమాలు చేసే విధంగా ప్రోత్సహించడం జరుగుతుందని రాధాకృష్ణ అన్నారు. కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్, రాష్ట్ర కోఆర్డీనేటర్ విష్ణు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బంగారు ఆభరణాల అప్పగింత



బాధితుడికి బంగారు ఆభరణాలను అందజేస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం: అజాగ్రత్తగా కారు దిగుతుండగా పడిపోయిన మూడు తులాల బంగారు ఆభరణాలను బాధితుడికి అందజేసిన ఘటన ఇబ్రహీంపట్నంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బీఎన్‌రెడ్డిలో నివాసముండే సీహెచ్ ఉష, మధుసూదన్‌రెడ్డిలు తమ వద్దనున్న మూడు తులాల బంగారు గొలుసు, చెవికమ్మలు బాగు చేయించుకునేందుకు ఇబ్రహీంపట్నానికి గతంలో వచ్చారు. కారు దిగే సమయంలో బంగారు ఆభరణాలు ఎక్కడో పడిపోయాయి. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీసీ ఫుటేజీలను కానిస్టేబుళ్లు శ్రీను, రాజులు ప్రత్యేకంగా పరిశీలించారు. బంగారు ఆభరణాలు కట్టిన కాగితపు పేపర్‌ను ఒక వ్యక్తి తీసుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే అతడిని ప్రశ్నించగా.. దొరికిన బంగారాన్ని పోలీసులకు ఇచ్చేశాడు. దీంతో బాధిత కుటుంబానికి బంగారు ఆభరణాలను అందజేసినట్లు సీఐ తెలిపారు.

మట్టి లారీల పట్టివేత

ఇబ్రహీంపట్నం: సాగర్ హైవేపై నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న 13 లారీలను ఇబ్రహీంపట్నం పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. చింతపల్లి నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా లారీల్లో మట్టిని తరలిస్తుండగా అడ్డుకొని, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

ఎలక్ట్రానిక్స్ షోరూంలో చోరీ

రూ.1.10 లక్షలు అపహరించిన దుండగులు

శంకర్‌పల్లి: పట్టణంలోని ఓ ఎలక్ట్రానిక్స్ షోరూంలో చోరీ అయిన సంఘటన మంగళవారం వేకువజామున చోటుచేసుకుంది. శంకర్‌పల్లి డీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ కొన్నేళ్లుగా శంకర్‌పల్లిలో ఎలక్ట్రానిక్స్ షోరూం నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి యథావిధిగా షోరూం మూసి వేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం వేకువజామున 3.30గంటలకు ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు షోరూం షట్టర్‌ను ఇనుప రాడ్లుతో పగులగొట్టి లోపలికి వెళ్లారు. షోరూం యాజమాని శ్రీనివాస్ అద్దె చెల్లించడం కోసమని దాచిన రూ.లక్ష 10వేల నగదును దుండగులు తస్కరించుకొని వెళ్లారు. కొద్ది సేపటికి స్థానికులు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న శ్రీనివాస్ షోరూంలో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం ఘటనాస్థలికి చేరుకొని వేలిముద్రలు, సీసీటీవీ ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు డీఐ తెలిపారు.

ఇంటి నిర్మాణాన్ని పరిశీలించిన డీఎల్‌పీఓ



వివాదాస్పద ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సాధన

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని గౌరెల్లి గ్రామంలో కొన్ని రోజులుగా వివాదాస్పదంగా మారిన ఓ భవన నిర్మాణాన్ని మంగళవారం జిల్లా డీఎల్‌పీఓ సాధన పరిశీలించారు. గ్రామంలో 191 సర్వే నంబర్‌లో ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీఓ వినోదతో కలిసి పరిశీలించిన ఆమె ఇంటి నిర్మాణానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గ్యార బాలలింగస్వామి, బీఎస్పీ ఇబ్రహీంపట్నం అధ్యక్షుడు గ్యార మల్లేశ్, పంచాయతీ కార్యదర్శి శేఖర్, నాయకులు కృష్ణ, ధన్‌రాజ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మిసెస్ వరల్డ్ ప్రైడ్‌గా నితాన్య

కాచిగూడ: మిసెస్ వరల్డ్ ఇంటర్నేషనల్ 2024 –సీజన్ 2 అందాల పోటీలు గుర్గావ్‌లోని లీలా యాంబియన్స్‌లో ఘనంగా జరిగాయి. ఈ పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన నితాన్య మిసెస్ వరల్డ్ ఇంటర్నేషనల్ 2024 సీజన్ 2లో మిసెస్ వరల్డ్ ప్రైడ్ బిరుదును గెల్చుకుంది. ఉత్కంఠ భరితంగా సాగిన సీజన్ 2 గ్రాండ్ ఫినాలే ఈవెంట్‌కు ఫ్యాషన్, వినోద రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

విత్తనాల కొనుగోలుపై అవగాహన



రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు

మొయినాబాద్: విత్తనాల కొనుగోలు, పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ప్రతి మంగళవారం మొయినాబాద్ రైతు వేదికలో చేవెళ్ల డివిజన్‌లోని అన్ని మండలాల రైతులకు, వ్యవసాయ శాఖ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతులకు విత్తనాల కొరత లేకుండా, నకిలీ విత్తనాలు విక్రయించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల సందేహాలను వ్యవసాయాధికారులు నేరుగా తెలుసుకుని నివృత్తి చేశారు. చేవెళ్ల ఏడీఏ రమాదేవి, ఏఓలు రాగమ్మ, తులసి, సురేష్‌కుమార్, వెంకటేశం, ఏఈఓలు సునీల్, కుమార్, రైతులు పాల్గొన్నారు.

న్యాయం చెప్పమంటే.. నట్టేట ముంచారు

- భూమి కొన్న రైతుకు తెలియకుండానే ఇతరులకు రిజిస్ట్రేషన్
- న్యాయం చేయాలంటూ దీక్షకు దిగిన బాధితుడు



దీక్షలో కూర్చున్న శివరాజ్, గ్రామస్తులు

షాద్‌నగర్‌రూరల్: కొనుగోలు చేసిన భూమిలో తలెత్తిన వివాదాన్ని పరిష్కరించాలని కోరిన గ్రామ పెద్దలే అక్రమార్కులతో చేతులు కలిపి బాధిత రైతును మోసం చేసిన ఘటన ఫరూఖ్‌నగర్ మండలంలో చేటు చేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 292లో 32 గుంటల భూమిని గ్రామానికి చెందిన పండుగ బాలయ్య గత 40 ఏళ్ల క్రితం కొనుగోలు చేశారు. ఇనాం భూమి కావడం, ఓఆర్సీ లేకపోవడంతో పట్టా చేసుకోలేదు. బాలయ్య మృతి చెందడంతో ఆయన కుమారుడు పండుగ శివరాజ్ తన పేరున భూమి పట్టా చేయాలని కొన్నేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో కొంత కాలంగా అమ్మిన వారికి, కొన్న వారికి పంచాయితీ కొనసాగుతోంది. ఈ వ్యవహారం గ్రామ పెద్దల వద్దకు వెళ్లింది. ఓఆర్సీ తీసుకున్న తరువాత మీ పేరున పట్టా చేస్తామని, అందుకు కొంత సమయం కావాలని గ్రామ పెద్దలు శివరాజ్‌కు నచ్చజెప్పారు. పంచాయితీ పెద్దలలో ఒకరు భూమి అమ్మిన వారితో కుమ్మక్కై ఓఆర్సీ వచ్చిన తరువాత తన పేరున పట్టా చేసుకొని మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారు. తరువాత ఈ విషయాన్ని తెలుసుకున్న శివరాజ్ గ్రామంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద దీక్షకు దిగారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి శివరాజ్‌కు మద్దతు తెలిపి దీక్షలో కూర్చున్నారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దారు ఆనంద్, ఆర్‌ఐ సలీంతో కలిసి గ్రామానికి చేరుకొని గ్రామస్తుల సమక్షంలో పంచనామా చేశారు. నివేదికను రెవెన్యూశాఖ ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. మీకు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో శాంతించిన గ్రామస్తులు దీక్షను విరమించారు. కార్యక్రమంలో ఎల్లప్ప, సామేల్, దామోదర్, బాల్‌రాజ్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, రఘురాం, రాజు, అజ్మత్‌బాబా, గ్రామస్తులు ఉన్నారు.

జంటహత్యల కారకులను శిక్షించాలి

జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్



బాధిత కుటుంబాలకు నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ, వైస్‌ఎంపీపీ

కడ్తాల్: మండల కేంద్రం సమీపంలో ఇటీవల జరిగిన జంట హత్యల కేసును వేగంగా విచారణ జరిపి, నిందితులను కఠినంగా శిక్షించాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని గోవిందాయిపల్లి గ్రామానికి చెందిన శేషుగారి శివగౌడ్, గుండెమోని శివగౌడ్ ఇటీవల దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్‌లు గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు చెందిన ఇద్దరు యువకులను దారుణంగా హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేతికొచ్చిన బిడ్డలను కోల్పోయి కన్నీరు మున్నీరవుతున్న కుటుంబాల బాధ వర్ణనాతీతమన్నారు. అనంతరం బాధిత కుటుంబాలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తరఫున చైర్మన్ దశరథ్‌నాయక్ రూ.10 వేలు, వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.10 వేల అందించారు. కార్యక్రమంలో నాయకులు జోగువీరయ్య, హరిచంద్, దేవానాయక్, ఎల్లాగౌడ్, పాండునాయక్, యాదయ్య, రహీం, సోమయ్య, జంగయ్య, చెన్నయ్య, వెంకటయ్య, సాయిలు పాల్గొన్నారు.